కథ

# అంతులేని ఆనందం

## గొట్టుముక్కల శ్రీలలిత

**బెండకాయలా ముదిరిపోతున్న తన ముద్దులకొడుకు పెళ్ళి గురించే విశాలాక్షి బెంగంతా. ఎప్పుడు కొడుక్కి పెళ్లి చేస్తానా, కోడలి రాకతో ఇల్లు ఎప్పుడు కళకళలాడుతుందా అనేది ఆమె ఆత్రుతంతా.**



"ఒరే!పద్దూ! అసలు నీ మనసు లోని ఉద్దేశం ఏంటో చెప్పరా?" అంటూ కొడుకు వెంటపడింది తల్లి విశాలాక్షి.

"...."

కొడుకు మౌనం ఆమెకి తిక్కరేగేలా చేస్తోంది. అయినా పెళ్లయిన పదిహేనేళ్లకు లేక లేక పుట్టిన పద్మనాభం అంటే ఆమెకి ఎంతో ప్రాణం. భర్త సదాశివరావు ఏమన్నా ఆమె కస్సుబుస్సుమంటుంది కానీ కొడుకుని మాత్రం పల్లెత్తుమాట కూడా అనదు. అదీ మాతృహృదయం అంటే అని గర్వంగా అనుకుంటాడు పద్మనాభం.

వయస్సొచ్చిన (ఇతనికి పెళ్ళీడొచ్చి దశాబ్దం దాటిపోయింది లెండి!) కొడుక్కి పెళ్లిచేసి కొడుకు, కోడలి అన్యోన్యతని చూసి హాయిగా కృష్ణారామా అనుకుందామంటే అస్సలు కొడుక్కి నచ్చిన అమ్మాయే దొరకడం లేదు.

కొడుక్కి ఎలాంటి అమ్మాయి కావాలో కనుక్కోవడం చాలా కష్టంగా మారింది విశాలాక్షికి.

★ ★ ★

మన కథానాయకుడు పద్మనాభం పెళ్ళి వినాయకుడి పెళ్ళిలా ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. అలాగని అతనికి నచ్చిన అమ్మాయి దొరికిందని కాదు. ఏ అమ్మాయిని చూసినా ఆమెలో ఏదో వంక పెట్టేస్తున్నాడు బ్రహ్మచారి పద్మనాభం. అసలు వాడికి ఎలాంటి అమ్మాయి కావాలో తెలియని అతని తల్లిదండ్రులకి పద్మనాభం పెళ్లి విడిపోని చిక్కుముడిలా మారింది.

అవి పద్మనాభం అరవయ్యో పెళ్లిచూపులు. అతనికి ఇప్పుడు ముప్పై ఏడేళ్ళు. సరైన వయస్సులో వీడికి పెళ్లి చేస్తే ఈసరికి ఇద్దరో ముగ్గురో పిల్లలతో ఇల్లంతా సందడిగా ఉండేదని విశాలాక్షి వాపోతూ ఉంటుంది. అయినా కొడుకులో మాత్రం ఎలాంటి చలనం ఉండడం లేదు.

పోనీ ఎవరినైనా ప్రేమించాడా? అంటే క్వశ్చన్ మార్కు ముఖం పెడతాడు పద్మనాభం.

ఎలాగోలా బెజవాడకి బహుదూరంలో ఉన్న ఓ గ్రామానికి చేరుకున్నాడు పద్మనాభం తన జననీ జనకులతో.

''రండి బావగారూ! చాలా శ్రమపడి వచ్చారు. ఏమైనా తీసుకుంటారా?''అన్నాడు పెళ్లికూతురు తండ్రి పద్మనాభం జనకుడు సదాశివరావుతో.

''ఏం చేస్తాం? కాలం మారిపోయింది. ఒకప్పుడు అమ్మాయి పెళ్ళి చేయడానికి కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. ఇప్పుడు అంతా రివర్స్ అయిపోయింది'' అన్నాడాయన వినీ వినిపించనట్టుగా.

ఆయన ఏం అంటున్నాడో అర్థంకాక ఎందుకులే మళ్లీ అడగడం అని అనుకుని పెళ్ళికూతురి తండ్రి పెళ్లిచూపులేర్పాటుచేసిన చోటుకి అందర్నీ తీసుకెళ్లాడు.

''అమ్మాయిని తీసుకురండి'' అన్నారు సదాశివరావు. ఈ పెళ్లిచూపుల్లోనైనా అమ్మాయి నచ్చితే పెళ్లి చేసి ఓ బాధ్యత తీర్చుకుందామన్న ఆకాంక్ష ఆయనలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

దానికి కారణం కొడుకు ఎన్ని పెళ్లిచూపులకెళ్లినా అమ్మాయి ఎంత బాగున్నాసరే నాకు నచ్చలేదు. అమ్మాయి ధోరణి నాకు అంతుబట్టడం లేదని వేదాంతం చెప్పడం తప్ప ఈ అమ్మాయి నచ్చింది అని మాత్రం అతను ఎప్పుడూ మనసు విప్పి చెప్పలేదు మరి.

''ఒరేయ్! ఇలా అయితే ఎలారా? ఇప్పటికే నీవు పెళ్లిచూపుల్లో హాఫ్ సెంచరీ కొట్టేశావు. ఇంకా కొన్నాళ్లయితే నీవు సెంచరీకి చేరువవుతావు. పెళ్లిచూపులకి నీతో పాటు రాలేక మేం దేనికి చేరువవుతామో అర్థంకావడం లేదు'' అంటూ కొడుకు మీద వ్యంగ్యాస్త్రాలు సంధించాడు సదాశివరావు.

★ ★ ★

''ఒరేయ్! నీ సంగతేంటో మాకు బోధపడడం లేదురా! ఏంటో చెప్పి తగలడు'' అన్నారు సదాశివరావు విసుగ్గా.

అలా కొడుకు మీద కారాలు మిరియాలు నూరడం ఎన్నోసారో లెక్కేలేదు.

అయినా పద్మనాభం నోరు మాత్రం విప్పలేదు. ఏ పెళ్లిచూపులకెళ్లినా అమ్మాయితో మాట్లాడడం తప్ప ఏం జరగడం లేదు. వారిద్దరూ ఏం మాట్లాడుకుంటున్నారో తెలీక అటు పెళ్లికూతురు తరపువాళ్ళు, ఇటు పెళ్లికొడుకు తరపువాళ్ళు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

★ ★ ★

''అబ్బాయి ఆలోచన ఏంటో కనుక్కో!'' అన్నాడు తండ్రి సదాశివరావు భార్యతో.

''అలాగేనండి'' అంటూ ఆయనకి టీ ఇచ్చేసి ఇంట్లోకి వెళ్ళిపోయిందామె.

అలా అంది గాని కొడుకు తనతో ఏమైనా చెబుతాడా అని ఆమెలో సందేహం మెదిలింది.

పద్మనాభం ఫ్రెండ్స్ ఎవరికైనా వీడి ఆలోచనలు తెలుస్తాయి కదా అని వారి గురించి ఆలోచించడం మొదలెట్టిందామె. అలా...అలా ఆలోచించి చివరకు ఓ నిర్ణయానికి వచ్చింది. పద్మనాభంతో 'క్లోజ్'గా మూవ్ అయ్యే కిషోర్ ఆమె మదిలో మెదిలాడు.

అతని ఫోన్ నెంబర్ సంపాదించి అతన్ని ఓ మారు ఇంటికి రమ్మని చెప్పిందామె.

పద్మనాభం తల్లి పిలవడంతో ఆమె మాట కాదనలేక పద్మనాభం ఇంట్లో లేని టైంలో వాళ్ల ఇంటికి వచ్చాడు కిషోర్.

''బాబూ కిషోర్ బాగున్నావా?'' అంటూ ఆమె కుశలప్రశ్నలు వేసి తాగడానికి మజ్జిగ ఇచ్చింది.

''బాగున్నానాంటీ! ఏంటి నాతో ఏదో మాట్లాడాలన్నారు?'' ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా విషయంలోకి వచ్చేయాలని నిర్ణయించుకున్నాడు కిషోర్.

అతని అంతరంగం తెలుసుకున్న పద్మనాభం తల్లి ''అదేనయ్యా నీతో ఎలా చెప్పాలో అర్థంకావడం లేదు. మావాడి పెళ్లి గురించే మా దిగులంతా. ఏంటో మీరంతా పెళ్లిళ్ళు చేసుకుని హాయిగా పిల్లాపాపలతో ఉంటే వీడేమో ముదిరిన బెండకాయలా మా ముందు తిరుగుతున్నాడు'' ఆమె సంభాషణలో కొడుకు పట్ల ఉన్న ప్రేమ వ్యక్తం అయింది.

''ఎందుకాంటీ అంతగా బాధపడుతున్నారు. మీ అబ్బాయికి ఏమంత వయసు మీరిపోయిందని అలా అంటున్నారు. కళ్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగదని మీరే చెబుతుంటారు కదా. మన పద్దుకి కళ్యాణయోగం ఇంకా రాలేదేమో'' అన్నాడు వేదాంత ధోరణిలో.

మేనమామ కూతురుందని తల్లిదండ్రులు పోరుపెట్టడంతో చిన్నతనంలోనే కిషోర్ పెళ్లి చేసుకున్నాడు. పెళ్ళయిన వెంటనే కవల పిల్లలు పుట్టడంతో కిషోర్ ఒకేసారి జాక్‌పాట్ కొట్టినట్లు ఇద్దరు పిల్లలకి తండ్రై ఇటు జీవితంలో, వెనువెంటనే ఉద్యోగంలో స్థిరపడిపోయాడు.

కిషోర్ మాటలతో ఆమె కాస్త ఊరడిల్లి మళ్లీ మనసు కర్తవ్యబోధ చేయడంతో పద్మనాభం మనసులో ఏముందో తెలుసుకోవాలని అనిపించింది.

''కిషోర్! నేనోమాట అడుగుతాను చెబుతావా?''

''అడగండాంటీ! నాదగ్గర మీకు మొహమాటం దేనికి? నాకు తెలిసిందేమైనా ఉంటే తప్పకుండా చెబుతాను''వినయంగా అన్నాడు కిషోర్.

''అలాగే!'' అంటూ వంటింట్లోకి వెళ్ళి అతని కోసం కొన్ని స్నాక్స్, టీ తీసుకొచ్చిందామె.

స్నాక్స్ తింటూ టీ తాగుతూ ఆమె చెప్పేది వినడానికి సంసిద్ధుడైనాడు కిషోర్.


''నా బాధంతా వాడి పెళ్ళి గురించే అని తెలుసుకదా. ఇప్పటికే చాలా సంబంధాలు చూశాం. ఇక వాడికి సంబంధాలు వెతకలేకపోతున్నాం. అయినా వాడి మనసులో ఏముందో తెలిస్తే అలాంటి అమ్మాయిని వెదికి పెట్టవచ్చు. అదే తెలియడంలేదు. పెళ్లిచూపులకి వెళతాం. అమ్మాయి మాకు నచ్చుతుంది. వాడేవో ప్రశ్నలు వేస్తాడు. తర్వాత విషయం చెబుతామని బయటికి వచ్చేస్తాం. ఆ తర్వాత అమ్మాయి నచ్చలేదని చెబుతాడు. వారికి ఉత్తరం రాయడం, తిరిగి మళ్లీ ఇంకో సంబంధం కోసం వెతకడం మామూలైపోయింది' అంటూ ఆమె తన బాధను వ్యక్తం చేసింది.

మిత్రుడి మనసులోని ఆలోచన ఏమై ఉంటుందా అని అతను ఆలోచిస్తున్నాడు.

కాలేజీ రోజులు అతని కళ్లముందు మెదిలాయి.

★ ★ ★

కాలేజీలో ఉన్నప్పుడు కిషోర్, పద్మనాభంలు ఎంతో క్లోజ్‌గా ఉండేవారు. కాలేజీకొచ్చిన తర్వాత



అమ్మాయిల గురించి ఆలోచించే కిషోర్ మీద చికాకుపడేవాడు. అయినా అప్పుడప్పుడూ అమ్మాయిల వంక దొంగచూపులు చూస్తుండేవాడు. ఒకరోజు అమ్మాయి ఎలా ఉంటే బాగుంటుందని కిషోర్‌ని అడిగితే తనకు ఆల్రెడీ మేనమామ కూతురు ఉందని, ఇక వేరే అమ్మాయి గురించి ఆలోచించడం దండగ అని చెప్పుకొచ్చాడు.

''మరెందుకు అలా అమ్మాయిల్ని కామెంట్ చేస్తావు?'' అంటే

''కాలేజీ లైఫ్‌లో ఇవన్నీ మధురానుభూతులు''అంటూ చిన్న లెక్చర్ ఇచ్చేవాడు కిషోర్.

కిషోర్ అమ్మాయిల్ని కామెంట్ చేసినా వారు నొచ్చుకునేలా అవి ఉండేవి కావు. అందరితో ఎంతో సరదాగా ఉండేవాడు.

అదే అదనుగా భావించిన కిషోర్ పద్మనాభంకి ఎలాంటి అమ్మాయి నచ్చుతుందో అడిగేశాడు. అయితే ఒకేసారి అలా అడగడంతో పద్మనాభం ఏం చెప్పాలో తెలియక నీళ్ళు నమిలాడు.

''పోనీలేరా! ఈరోజంతా ఆలోచించి స్వప్నంలోకొచ్చిన నీ డ్రీమ్ గాళ్ గురించి రేపు చెప్పు'' అంటూ మేలమాడాడు కిషోర్.

మర్నాడు తనకు నచ్చే అమ్మాయికి ఎలాంటి లక్షణాలు ఉండాలో సింపుల్‌గా కిషోర్ చెవిలో చెప్పేశాడు.

డిగ్రీ కాలేజీలో ఉండగా కిషోర్‌కి పెళ్లయిపోవడంతో పద్మనాభం చెప్పిన మాటలు అలాగే ఉండిపోయాయి.

ఇన్నాళ్లకు మళ్లీ అవి వెలుగుచూసే అవకాశం కలిగింది. వాటిని గుర్తుచేసుకుంటూ పద్మనాభం తల్లితో ఆ సంగతి చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు కిషోర్.

★ ★ ★

''ఆంటీ మీ అబ్బాయి ఎలాంటి కట్నం లేకుండా పెళ్లిచేసుకోవాలని అనుకుంటున్నాడు. అంతేకాదు అతనికి కాబోయే భార్య అణకువగా ఉండాలనేవాడు. సిగనిండా పూలు పెట్టుకుని, బారెడు జడతో కన్పించాలని ఉందనేవాడు. మోడ్రన్ డ్రెస్‌లంటే అతనికిచాలా చికాకట. ఆడదాని అందాన్ని బహిర్గతం చేసే అలాంటివాటికి తాను వ్యతిరేకం అని చెప్పేవాడు. అంతేకాదు అమ్మాయి తన తల్లిదండ్రుల్ని ప్రేమగా, అభిమానంగా చూసుకోవాలని వారితో కలిసిమెలిసి ఉండాలని కోరుకునేవాడు.

అంతేకాదు మిగతా కొడుకుల్లా పెళ్లయిన వెంటనే వేరుకాపురం పెట్టడం తమకిష్టం ఉండదని చెప్పేవాడు. తమ ఆనందాన్ని తల్లిదండ్రులు పాడు చేస్తారని భావించేవారికి పద్మనాభం ఆలోచనలు చెంపపెట్టులా ఉండేవి. తాను కోరుకునే లక్షణాలున్న అమ్మాయి దొరికేవరకూ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్‌లా పెళ్లిచూపుల్లో సెంచరీలు చేయడానికైనా తాను సిద్ధమే అంటుండేవాడు'' అంటూ కిషోర్ పద్మనాభం అంతరంగాన్ని విప్పడంతో పద్మనాభం తల్లి మనసు ఆలోచనలో పడింది. కాస్సేపటికి వాస్తవంలోకి వచ్చింది.

''అయినా ఈకాలంలో ఇలాంటి అమ్మాయిలు దొరుకుతారంటావా బాబూ!'' అంటూ కాసింత నిరాశని వ్యక్తంచేసిందామె.

''ఎందుకు దొరకరాంటీ! మనసుంటే మార్గం ఉంటుందంటారు కదా. మీ అబ్బాయికి తగిన అమ్మాయి ఎక్కడో పుట్టే ఉంటుంది. సారీ...ఎదిగే ఉంటుంది. అంతెందుకు మీ పెద్దలే అంటారు కదా అబ్బాయికి తగిన అమ్మాయిని ఆ దేవుడే ఎక్కడో ఒకచోట పుట్టిస్తాడని. కాసింత ఓపికగా వెతికితే అలాంటి చక్కనిచుక్క మీకు దొరుకుతుంది. నేను కూడా ట్రైచేస్తాను లెండి'' అంటూ ఆమెలో ఆశల బీజాలు నాటాడు కిషోర్.

''నీ నోటి చలవ నిజమైతే అంతకన్నా కావాల్సింది ఏముంటుంది?'' అంటూ కిషోర్‌కి ఇష్టమైన జీడిపప్పు ఉప్మా తెచ్చిచ్చిందామె.

అది తింటూ మరి కాస్సేపు ఆమెతో కబుర్లు చెప్పి ఇంటికి చేరుకున్నాడు కిషోర్.

★ ★ ★

కొడుకు అంతరంగం తెలిశాక విశాలాక్షి కొడుక్కి నచ్చే అమ్మాయి కోసం వేట ప్రారంభించింది. అప్పుడామెకి తమ దూరపు బంధువు కూతురు గాయత్రి మదిలో మెదిలింది.

కాస్త వయసు తక్కువైనా అందంలో అపరంజి బొమ్మ. కాకినాడలో ఉండే ఆ అమ్మాయి ఇప్పుడు డిగ్రీ చదువుతోంది. అందంతో పాటు అణకువ కూడా కలబోసిన ఆ అమ్మాయి గురించి ఆమె వినడమే కానీ స్వయంగా చూడలేదు.

అందుకే ఆమెని ఎలాగైనా కలవాలని కాకినాడలో ఉన్న తన చిన్నాన్నగారి అబ్బాయి ఇంటికి అకస్మాత్తుగా బయలుదేరింది.

అసలు సంగతి చెప్పకుండా కాకినాడలో బంధువుల్ని చూసి చాలాకాలం అయిందని, వాళ్ల ఇంట్లో ఫంక్షన్స్‌కి రమ్మని ఫోన్ చేశారని అబద్ధం చెప్పి కాకినాడకి బయలుదేరిందామె.

వంద అబద్ధాలాడైనా పెళ్ళి చేయమంటారు పెద్దలు. ఆమెకు కొడుకు పెళ్లికోసం ఈ అబద్ధం ఆడక తప్పలేదు.

★ ★ ★

కాకినాడ రైల్వే స్టేషన్‌లో దిగిన విశాలాక్షికి తన తమ్ముడు విశ్వనాథం సాదరంగా స్వాగతం చెప్పాడు.

తన కారులో ఇంటికి తీసుకెళ్లి అక్కడ సకల మర్యాదలు చేశాడు. ఎప్పుడోగానీ రాని తన ఆడపడుచుని చూసి విశ్వనాథం భార్య ఎంతో సంతోషించింది.

తన మరదలి మమకారం, మర్యాదలు విశాలాక్షిని ఎంతో సంతృప్తి పరిచాయి. వారి ఆతిథ్యానికి ఎంతో సంతోషించింది విశాలాక్షి. తన మరదలితో అసలు సంగతి చెప్పి గాయత్రి గురించి కనుక్కుంది. అంతేకాదు ఆమెతో ఎలాగైనా మాట్లాడాలని, ఆమె జీవనశైలిని పరిశీలించాలని ఉందని చెప్పింది.

అంతేకాదు ఆమెతో ఎలాగైనా మాట్లాడాలని, ఆమెని పరిశీలించాలని ఉందని చెప్పింది.

వాళ్ళుండేది విశ్వనాథం ఇంటికి దగ్గరే అని తెలిసి 'వెదకబోయిన తీగె కాలికి తగలడం అంటే ఇదేనేమో!' అంటూ ఎంతో సంతోషించింది.

అప్పటినుంచి హైదరాబాద్‌కి వచ్చేవరకూ ఆమె వారంరోజులపాటు గాయత్రి దినచర్యని గమనించసాగింది.

★ ★ ★

ప్రతిరోజూ త్వరగా లేవడం, స్నానపానాలు ముగించుకుని తులసి చెట్టు దగ్గర పూజలు చేయడం గాయత్రికి అలవాటు. ఆ అలవాట్లని ఆమె తు.చ తప్పకుండా పాటించడం విశాలాక్షి గమనించింది.

తన కొడుకు కోరుకునే లక్షణాలన్నీ ఈ అమ్మాయిలో పుష్కలంగా ఉన్నాయి అనుకుంది.

హైదరాబాద్ వెళ్ళేముందు గాయత్రి తల్లిదండ్రులతో మాట్లాడమని తమ్ముడు మరదలికి పురమాయించి హైదరాబాద్‌కి వచ్చేసింది.

కాకినాడకెళ్లి ఎంతో సంతోషంతో వచ్చిన తల్లిని చూసిన పద్మనాభానికి ఆ ఆనందం వెనుక దాగిన అసలు విషయం అంతుచిక్కలేదు.

వారంరోజుల తర్వాత ఆమె కాకినాడ ఎందుకెళ్ళిందో అర్థమైంది.

కాకినాడ పెళ్ళిచూపులకి వెళ్లడం, అమ్మాయి పద్మనాభానికి నచ్చడం ఒకేసారి జరిగిపోయాయి.

రెండునెలలు తిరక్కుండానే పద్మనాభం. గాయత్రి భార్యాభర్తలయ్యారు. డిగ్రీ పూర్తయ్యాక కాపురానికి వచ్చింది గాయత్రి.

అత్తింటికి వచ్చిన గాయత్రి అత్తమామల్ని ఎంతో ప్రేమగా చూడడం మొదలెట్టింది. కోడలి ప్రవర్తన వారికి ఎంతో సంతోషాన్నిచ్చేది. పుట్టింటికి రమ్మన్నా ఆమె వెళ్లేదికాదు. పుట్టినింటి కంటే మెట్టినిల్లే ఆడదానికి స్వర్గమని ఆమె చెబుతుండేది.

ఆమె ఆలోచనలు ఈతరం అమ్మాయిల ఆలోచనలకు భిన్నంగా ఉండడం విశాలాక్షికి సంతోషాన్నిచ్చేది.

పెళ్లి కాలేదని ఇప్పటివరకూ ఆందోళన పడిన విశాలాక్షికి ఆలస్యమైనా మంచి కోడలు రావడం ఆనందాన్ని కలిగించింది. తనకోడలు ఇలాగే ఉండాలని ఆ దంపతులు దేవతల్ని కోరుకుంటున్నారు. తమకు కలిగిన అంతులేని ఆనందం కలకాలం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు విశాలాక్షి దంపతులు.

పెళ్ళైన కొన్నాళ్లకు పద్మనాభానికి హైదరాబాద్ నుంచి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ కావడం, తన తల్లిదండ్రుల్ని విడిచి పద్మనాభం కొత్త కాపురం పెట్టడం చకచకా జరిగిపోయింది.

వైజాగ్‌కి ట్రాన్స్‌ఫర్ అయినా ఆరునెలలకో మారు తల్లిదండ్రుల దగ్గరకి వెళ్లిరావడం, వారితో సరదాగా గడపడం మామూలైపోయింది. ఉన్న నాలుగు రోజులు అత్తమామలతో సఖ్యంగా ఉండడం నేర్చుకుంది గాయత్రి. పెళ్ళయ్యాక కొడుకు తమ దగ్గరే ఉండకపోయినా ఇలా వచ్చిపోతుండడం విశాలాక్షి దంపతులకి ఆనందంగానే ఉంది.

కొసమెరుపు ఏమిటంటే పద్మనాభం ట్రాన్స్‌ఫర్ వెనుక గాయత్రి తండ్రి హస్తం ఉందని అతని తల్లిదండ్రులకి ఏమాత్రం తెలీదు.

★